www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 22 జులై 2025
5
కాకినాడ



విఎస్.అచ్యుతానందన్ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి-కాకినాడ

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పూర్వ పొలిట్‌బ్యూరో సభ్యుడు విఎస్. అచ్యుతానందన్ మృతికి సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. పార్టీ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమ నాయకునిగా, అనేక పోరాటాల్లో కీలకమైన వ్యక్తిగా ఆయన వ్యవహరించారన్నారు. కృష్ణ పిళ్లై నాయకత్వంలో భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారని, కార్మికులు, వ్యవసాయ కార్మికుల పోరాటాలకు ప్రత్యక్ష నాయకత్వం వహించారని, కేరళలో కమ్యూనిస్టు పార్టీని అభివృద్ధి చేయడంలో కీలకమైన పాత్ర నిర్వహించారని తెలిపారు. 2006 నుంచి 2011 వరకు ముఖ్యమంత్రిగా సేవలందించారని తెలిపారు.

చిరస్మరణీయుడు గోళ్లమూడి నాగేశ్వరరావు

సంస్మరణ సభలో ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి-కాకినాడ

ఉపాధ్యాయునిగా, ప్రజాసైన్స్ ఉద్యమ కార్యకర్తగా, ప్రజాప్రతినిధిగా విశిష్టమైన సేవలు అందించిన గోళ్లమూడి నాగేశ్వరరావు చిరస్మరణీయుడని మాజీ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) సహా పలువురు ప్రజాసంఘాల నేతలు కొనియాడారు. ఆదివారం సాయంత్రం కాకినాడ యుటిఎఫ్ టీచర్స్ హోమ్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నాగేశ్వరరావు మాస్టారి సంస్మరణ సభ నిర్వహించారు. యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఐ.వెంకటేశ్వరరావు, సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఐవి మాట్లాడుతూ యుటిఎఫ్‌లో జిఎన్‌ఆర్‌గా పిలుచుకునే నాగేశ్వరరావు ఉపాధ్యాయునిగా విద్యార్థుల మనసులపై చెరగని ముద్ర వేశారని, ఉద్యమ పథంలోనూ తనదైన శైలిలో పని చేశారని గుర్తు చేశారు. అక్షర గోదావరి ఉద్యమంలో, అక్షర కళాయాత్ర నిర్వహణలో నాగేశ్వరరావు శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. రిటైర్ అయిన తరువాత కాకినాడ 49వ డివిజన్ కార్పొరేటర్‌గా పని చేసిన నాగేశ్వరరావు ఆదర్శ ప్రజాప్రతినిధిగా నిలిచారన్నారు. సిఐటియు నేత బేబిరాణి మాట్లాడుతూ సుందరయ్య భవన్ నిర్మాణ కమిటీ కన్వీనర్‌గా ఆయన సేవలను మరువలేమన్నారు. ప్రజా సంఘాలలో యువ కార్యకర్తలను ప్రోత్సహించడంలో నాగేశ్వరరావు ముందు వరుసలో ఉన్నారని తెలిపారు. రూరల్ జెడ్‌పిటిసి నురుకుర్తి రామకృష్ణ, రూరల్ మండలం సీనియర్ నాయకుడు పెద్దాడ సుబ్బారాయుడు, రోటరీ సంస్థ పెద్దలు మూర్తి, ప్రముఖ ఇంజనీరు గట్టి సత్యనారాయణ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి.నగేష్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కెఎంఎంఆర్ ప్రసాద్, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మోర్త రాజశేఖర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, అంబేడ్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, ఐద్వా నాయకురాలు సిహెచ్.రమణి, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఎ.వాసుదేవ్, క్రరి నాగేశ్వరరావు, సిహెచ్.అజయ్, పి.రామకృష్ణ, జె.శ్రీనివాస్, సిహెచ్.విజయ్ కుమార్, బి.రత్నం, గనారా, గుత్తుల రామకృష్ణ, య.సత్యనారాయణ, తదితరులు మాట్లాడారు. నాగేశ్వరరావు మానవ సంబంధాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అనేక మందితో గొప్ప స్నేహ సంబంధాలు కొనసాగించారన్నారు. సిపిఎం కార్పొరేటర్‌గా 49వ డివిజన్‌కు ప్రాతినిధ్యం వహిస్తునే నగర సమస్యలను కౌన్సిల్‌లో లేవనెత్తారని తెలిపారు.

నాగేశ్వరరావు జీవిత విశేషాలు, ఆయనతో అనుబంధ ఉన్న ప్రముఖుల అభిప్రాయాలతో ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గీతాలు అలరించాయి. సభకు సిహెచ్.వెంకట రమణ ఆహ్వానం పలుకగా పలివెల వీరబాబు వందన సమర్పణ చేశారు. సిఐటియు నాయకులు మలకఆ వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, యుటిఎఫ్ నాయకులు టి.అన్నారాం, సిహెచ్.సూరిబాబు, వి.సోని, పివిఎన్ గణేష్, ఎన్.గోవిందరాజులు, ఎంవి.సాయిరాం, జన విజ్ఞాన వేదిక నాయకులు బివివి సత్యనారాయణ, ఈశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు సాహిత్, ఆదర్శ్, నాగాబత్తుల సూర్యనారాయణ, సిహెచ్.వేణు, ఎం.నాగలక్ష్మి, వి.రవి కుమార్, ఎన్‌వి.పద్మావతి, గోళ్ళమూడి అజయ్ పాల్గొన్నారు.


గోళ్లమూడి నాగేశ్వరరావుకు నివాళులు అర్పిస్తున్న నాయకులు


నాగేశ్వరరావుపై ప్రజాశక్తి ప్రత్యేక సంచికలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న మత్స్యకార సంఘం నాయకులు

మత్స్యకారులకు నష్టపరిహారం అందించాలి

ప్రజాశక్తి-పిఠాపురం

ఓఎన్‌జిసి, ఇతర ఆయిల్, ఫార్మా కంపెనీలు కార్యకలాపాల వల్ల వేట సరిగా జరగడం లేదని, మత్స్యకారుల జీవనోపాధి దెబ్బ తింటోందని అందువల్ల మత్స్య కారులకు నెలకు రూ.11500 నష్ట పరిహారం ఇవ్వాలని పలువురు మత్స్యకార సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘాలు, మత్స్యకార సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉప్పాడ బస్ స్టాండ్ నుండి జనసేన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంగాయమ్మరావు పేటలోని జనసేన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సిహెచ్.రమణి మాట్లాడుతూ మత్స్యకారులకు ఎన్నికలు ముందు అన్ని రాజకీయ పార్టీలూ హామీలు ఇచ్చాయన్నారు. ప్రధానంగా జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారిని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారని, కానీ నేటికీ హామీలు అమలు చేయడం లేదన్నారు. దశలవారీగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో వినతిపత్రం ఇస్తామని ముందుగా తెలియచేసినప్పటికీ ఇన్‌ఛార్జి రమ్మని చెప్పి ఉండకుండా వెళ్లిపోవడం దారుణం అన్నారు. తెలుగు జనతా పార్టీ నాయకులు పెద్దింశెట్టి వెంకటేశ్వరావు మాట్లాడారు. మత్స్యకార సంఘం నాయకులు యు.సత్యనారాయణ, సంగాడి ఈశ్వరావు, బడే సత్యారావు , కోనాడ తాతారావు, మైలపల్లి బుజ్జి, పిక్కి రాజు, వీరబాబు, బొడ్డు నాగేశ్వరరావు ఆనందు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ర్యాలీ, హాకీ టోర్నీకి స్పాన్సర్‌షిప్ ఆహ్వానం

ప్రజాశక్తి-కాకినాడ

ఆగస్టు నెలలో జిల్లాలో జరగనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ, జాతీయ జూనియర్ ఉమెన్ హాకీ ఛాంపియన్షిప్ పోటీలకు స్పాన్సర్‌షిప్ ఆహ్వానిస్తున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారం సంస్థలు, ప్రైవేటు పాఠశాల, కళాశాలు, కార్పోరేట్ ఆస్పత్రులు, ఆసక్తి కలిగిన ఇతర వ్యక్తులు సామాజిక బాధ్యత కింద తమ వంతు సహకారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఆగస్టు ఒకటి నుంచి 12వ తేదీ వరకు జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్షిప్ పోటీలు అదేవిధంగా ఆగస్టు 3 నుంచి 20వ తేదీ వరకు ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరగనున్నాయన్నారు. హాకీ టోర్నమెంట్ కు 700 మంది, ఆర్మీ ర్యాలీకి రోజుకు సుమారుగా 1000 మంది హాజరవుతారన్నారు. ఈ ఆర్మీ ర్యాలీ, హాకీ టోర్నమెంట్ లను జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు, అభ్యర్థులు, క్రీడాకారులకు అల్పాహారం, భోజనం, వసతి , ఇతర సదుపాయలు కల్పించేందుకు ధన, వస్తు, ఆహార రూపాల్లో జిల్లాలోని పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారం సంస్థలు, ప్రైవేటు పాఠశాల, కళాశాలలు, కార్పోరేట్ ఆస్పత్రులు, ఆసక్తి కలిగిన ఇతర వ్యక్తులు సామాజిక బాధ్యత కింద తమ వంతు సహాయం, సహకారం అందజేయాలని కాకినాడ కలెక్టర్ కలెక్టర్ షాన్ మోహన్ సగిలి కోరారు.

మహిళల ట్రాప్ ఘటనలో కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ

పెద్దాపురంలో మహిళను ట్రాప్ చేసిన నిందితురాలు భారతి, ఆమెకు సహకరించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది. భారతి డబ్బు కోసం అమ్మాయిలను లోబరుచుకుని వ్యాపారం చేస్తోందని ఆమెకు సహకరించిన పోలీసులను విధుల నుంచి తొలగించాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి, ఐద్వా కోశాధికారి కె.నాగజ్యోతి, జిల్లా కమిటీ సభ్యులు జి.భూలక్ష్మి డిమాండ్ చేశారు. బాధితురాలు ఇటీవల ఒక యూట్యూబ్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లో తన గోడు వెళ్లబోసుకుందని తెలపారు. ఈ రాష్ట్రంలో తనకు న్యాయం జరగదని హైదరాబాద్ వరకూ వచ్చినట్టు ఆమె తెలిపిందన్నారు. బాధితురాలితో బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయించి ఐదు ఖాళీ చెక్కులపై సంతకాలు పెట్టించుకుని వేధించారన్నారు. బాధితురాలికి, ఆమెకు కుమార్తెకు తక్షణం రక్షణ కల్పించాలని, వారికి పునరావాసం కల్పించాలని, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పెద్దాపురంలో అమ్మాయిలను ట్రాప్ చేసే ముఠాలు ఉన్నట్టు వార్తలు వస్తున్నాయని, దీనిపై తక్షణం అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదిత్యలో ఉత్సాహంగా చదరంగం పోటీలు

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగా ఫార్మసీ విద్యార్థులకు చదరంగ పోటీలు నిర్వహించినట్టు ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవి శంకర్ తెలిపారు. చదరంగం ఎంతో పురాతనమైన, స్వీయ విశ్లేషణ, మేధో సంపత్తి పెంపొందించే క్రీడ అని, ప్రతిరోజూ కొంత సమయం చెస్ ఆడటం వల్ల జ్ఞాపక శక్తి మెరుగుపడుతుందని, మానసిక విజ్ఞానం, దూరదృష్టి, ఏకాగ్రత, ఆలోచనా సామర్థ్యం, అభివృద్ధి చెందుతుందని డాక్టర్ కె.రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఫార్మసీ, ఫార్మా డి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న నాగేశ్వరరావు

హాకీ టోర్నమెంట్, ఆర్మీ ర్యాలీకి రూ.లక్ష సాయం

ప్రజాశక్తి-కాకినాడ


కాకినాడ నగరంలో హాకీ టోర్నమెంట్, ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహణకు శ్రీఅగస్త్య ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.లక్ష విరాళం అందించారు. దీనికి సంబంధించిన చెక్కును శ్రీఅగస్త్య చైర్మన్ డైరెక్టర్ డి.నాగేశ్వరరావు సోమవారం కలెక్టర్ షాన్‌మోహన్ సగిలికి అందజేశారు.

కుండపోత వర్షం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణ మండల పరిధిలో సోమవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో పట్టణ ప్రజలు ఎండల తాపం నుండి ఉపశమనం పొందారు. పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ఆర్‌టిసి కాంప్లెక్స్, తెలుకుల వీధి, బండ్ల మార్కెట్, బుధవారం మార్కెట్, జయలక్ష్మి టాకీస్ రోడ్డు, ప్రెసిడెంట్ గారి వీధి వర్షం నీటితో వీధులన్నీ జలమయం అయ్యాయి. మున్సిపల్ డ్రైన్‌లో పూడికలు పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

కార్టూ'నిజం'



సమస్యలపై అంగన్‌వాడీల ధర్నా

అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం పలుచోట్ల అంగన్‌వాడీలు ధర్నాలు చేశారు. పని ఒత్తిడి తగ్గించాలని, ఫేస్ యాప్‌లు రద్దు చేయాలని, సరుకుల పంపిణీలో పాత విధానం కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.


ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ అర్బన్ ప్రాజెక్ట్ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి ఎంకె.జ్యోతి, పెదపూడి మండల నాయకులు ఎం.రాజేశ్వరి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పోషణ ట్రాక్టర్ యాప్, బాల సంజీవిని యాప్‌ను తీసుకువచ్చి లబ్ధిదారులను అంగన్‌వాడీ సెంటర్లకు దూరం చేసే విధానాలను మానుకోవాలన్నారు. లబ్ధిదారులకు అందించే ఆహారం ఒటిపి ద్వారా కెవైసి చేసి ఫోటో క్యాప్చర్ చేస్తేనే సరుకులు ఇవ్వాలని పెట్టే నిబంధనను తొలగించాలని, గతంలో వలే లబ్ధిదారులకు సంతకం పెట్టించుకుని సరుకులు ఇచ్చే విధానాన్ని అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను రద్దు చేయాలన్నారు. ఈ ధర్నాలో విజయ, సరోజ, మున్ని, రామలక్ష్మి, జ్యోతి, భాను, రాణి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహార సరుకుల పంపిణీ విధానంలో పాత పద్ధతులను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు దాడి బేబీ, ఎస్తేరు రాణి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌శాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు పిల్లలకు అందిస్తున్న సరుకులు పోషణ ట్రాకర్, బాల సంజీవిని యాప్ ద్వారానే ఇవ్వాలని నిర్ణయించాలన్నారు. బియ్యం, పప్పు, ఆయిల్, గుడ్లు, కిట్లు సరుకులు అన్ని ఒక్కసారిగా రావటం లేదన్నారు. తక్షణం యాప్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జి.మహాలక్ష్మి, రాజేశ్వరి, వాణి, లోవ కుమారి, విజయలక్ష్మి, తులసి, టిఎల్.పద్మావతి, ఎన్.మంగాలక్ష్మి, ఎస్‌కె ఫాతిమా, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జగ్గంపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ ట్రాకర్ యాప్, బాల సంజీవిని యాప్ తీసుకువచ్చి లబ్ధిదారులను అంగన్‌వాడీ సెంటర్లకు దూరం చేసే విధానాలను అమలు చేస్తున్నారన్నారు. అనంతరం సిడిపిఒ ఎం.పూర్ణిమకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సిహెచ్.రత్నం, కార్యదర్శి, పి.సుజాత, కోశాధికారి వైవి.రాజేశ్వరి, జి.రత్నం, రామలీల, గంగాభవాని, వి.అనంతలక్ష్మి, వై.శుభారత్నం పాల్గొన్నారు.


పిఠాపురం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు డి.శేషబాబ్జి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు డి.పద్మావతి, సిఐటియు మండల కార్యదర్శి కుంచే చిన్న, ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి డి.తులసీదేవి, విజయశాంతి, ప్రజావాణి, నళిని, పద్మ కుమారి, బేబీరాణి, ఆర్.బేబీ, వెంకటలక్ష్మి, రాఘవమ్మ, ప్రభ, సుజాత, రామతులసి పాల్గొన్నారు.


కాకినాడ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు


పిఠాపురంలో..


పెద్దాపురంలో..


జగ్గంపేటలో..


సూర్యఘర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

పిఎం సూర్య ఘర్ ద్వారా విద్యుత్ ఆదా

ప్రజాశక్తి-కాజులూరు

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా విద్యుత్‌ను ఆదా చేసుకొని ప్రజలు లబ్ధి పొందాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాజులూరు మండలం గొల్లపాలెంలో గృహిణి గుబ్బల సోమ సుందరిమణి ఏర్పాటు చేసుకున్న మూడు కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ వ్యవస్థను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ రాయితీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని మేలు పొందాలన్నారు. గొల్లపాలెంకు చెందిన మహిళ రూ.రెండు లక్షలతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోగా దానిలో రూ.78 వేలు ప్రభుత్వ సబ్సిడీగా లభిస్తుందని తెలిపారు. పిఎం సూర్య ఘర్ పథకంలో ప్రభుత్వం ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేలు సబ్సిడీ అందిస్తోందన్నారు. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వ రుణం పొందవచ్చును అన్నారు. అంతేకాక ఎస్‌సిలకు ఈ పథకాన్ని ఉచితంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. డ్వాక్రా మహిళలకు కూడా స్త్రీ నిధి పథకం కింద రుణం మంజూరు చేస్తారని తెలిపారు. విద్యుత్ ఆదా చేసేందుకు, విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపరాఉ. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు జవ్వాకుల నారాయణమూర్తి, దూడల శంకరనారాయణ, వల్లు అర్జునరావు, ఆర్యవటం సహకార సంఘం అధ్యక్షుడు కోట తాతబ్బాయి, ఎంపిడిఒ జె.రాంబాబు, ఎఇ వీర్రెడ్డి, దేగల వెంకట సతీష్, గుబ్బల యేసురాజు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామంగా పనసపాడు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పనసపాడు గ్రామాన్ని సారాయి రహిత గ్రామంగా ప్రకటిస్తున్నట్లు కాకినాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ కె.రామ్మోహనరావు చెప్పారు. సోమవారం ఆయన గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ కమిటీ సభ్యులతో గ్రామ సర్పంచ్‌తో కలిపి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం 2.0 పథకంపై గ్రామంలో ప్రచారం నిర్వహించి ప్రజలు నాటు సారా జోలికి వెళ్లకుండా ఇతర జీవనోపాధి కల్పిస్తున్నామని అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో సమన్వయంతో నాటు సారా నిర్మూలించినట్లు చెప్పారు. సోమవారం అధికారికంగా పనసపాడును నాటు సారా రైతు గ్రామంగా ప్రకటించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వివిబి.కుమార్, గ్రామ సర్పంచి చీకట్ల వెంకటేష్, విఆర్ఒ వి.దుర్గారావు గ్రామ కార్యదర్శి ఎన్.ముసలయ్య పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం, కాండ్రేగుల, మల్లిశాల గ్రామాలు మినహా మిగిలిన గ్రామాల్లో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి ఎస్.నరసింహం తెలిపారు. రైతు సేవా కేంద్రాల వద్ద యూరియాను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మరో మూడు రోజుల్లో ఆ గ్రామాల్లో కూడా యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు.

సొసైటీల బలోపేతంతో అన్నదాతకు మేలు

ప్రజాశక్తి-కాజులూరు

కూటమి పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని, పదవి ఒక అలంకారం మాత్రమే కాదని అదొక పెద్ద బాధ్యత అని రాష్ట్ర మాజీ సహకార శాఖ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. సోమవారం కాజులూరు మండలం పల్లిపాలెంలో సహకార పరపతి సంఘంకు ఎన్నికైన నూతన పాలక కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం చిక్కాల రామచంద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్‌గా కాలా నరసింహమూర్తి, సభ్యులుగా తాతపూడి గోపాలం, కోటి నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పిఎసిఎస్) ద్వారా రైతాంగానికి మేలు జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించి పాలన సాగిస్తున్నట్టు తెలిపారు. రైతాంగానికి ప్రాముఖ్యమైన పిఎసిఎస్‌లకు పునరుజ్జీవం తీసుకొచ్చి రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పార్టీ కోసం కష్టించి పని చేసిన వారికి తగిన ప్రాధాన్యత ఇస్తూ పదవులు ఇచ్చినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలకు పునర్జీవం తీసుకొచ్చి పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తున్నామన్నారు. జనసేన మండల అధ్యక్షులు బొండా వెంకన్న, నీటి సంఘం అధ్యక్షుడు రాయుడుకొండ నారాయణమూర్తి పాల్గొన్నారు.

త్వరలో టిడ్కో సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

టిడ్కో సముదాయాల్లో నెలకొన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారంఉప్పు వారి సత్రం వద్ద గల టిడ్కో గృహ సముదాయాయంలో ఆయన పర్యటించారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై ఎంఎల్ఎ చినరాజప్ప స్పందించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే జగదీష్ మోహన్, బలుసు వాసు, నిమ్మకాయల కిరణ్, పితాని సూర్యనారాయణ, దాట్ల శ్రీనివాస్, కురుకూరి సోమేశ్వరరావు, తాతపూడి కృష్ణబాబు పాల్గొన్నారు.


కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

నేరాలు ఘోరాలు

మంగళ సూత్రాలు చోరీ

ప్రజాశక్తి - మామిడికుదురు

అపరిచిత వ్యక్తి మంచినీళ్ల కోసం వచ్చి మహిళ మెడలో బంగారు మంగళ సూత్రాల బొంధు అపహరించిన సంఘటన పాశర్లపూడి బాడవలో ఆదివారం రాత్రి జరిగింది. బైక్‌పై వచ్చిన అపరిచిత వ్యక్తి వలవల వరలక్ష్మిని మంచినీళ్లు అడిగి, తరువాత సెల్ ఫోన్ ఇవ్వండని అడగడంతో ఆమె నిరాకరించింది. దీంతో ఆమె గొంతు పట్టుకుని బెదిరించి రెండున్నర కాసుల మంగళ సూత్రాల బొంధు తెంచుకొని బైక్‌పై వెళ్లిపోయినట్లు నగరం ఎస్ఐ చైతన్యకుమార్ సోమవారం తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

యువకుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గోదావరిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు గోదావరిలో గల్లంతయిన యువకుడు మతదేహం ఎట్టకేలకు లభించింది. పోలీసుల తెలిపిన వివరాలు ప్రకారం..ఖమ్మం జిల్లా వేంసూరు మండలం లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన పామర్తి సాయిదినేష్(22) సత్తుపల్లి వెస్ట్ మదర్ థెరిసా కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. శనివారం తన స్నేహితులతో వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చి గౌతమి గోదావరి నదిలో స్నానం చేస్తుండగా మునిగి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డిఆర్‌ఎఫ్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే సోమవారం అయినవిల్లి మండలం చానపల్లి లంక సమీపంలోని గౌతమి గోదావరి నదిలో సాయి దినేష్ మృతదేహం లభించింది. మృతదేహాన్ని పడవపై ఒడ్డుకు చేర్చి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన కొవ్వల దుర్గాభవాని(16) అదృశ్యమైందని తల్లి కొవ్వల ధనలక్ష్మి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. దుర్గాభవాని చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటుంది. ఈ నెల 17వ తేదీ రాత్రి నుంచి కనిపించట్లేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు.

గంజాయిని విక్రయిస్తున్న ఏడుగురు యువకుల అరెస్టు

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని జగనన్న కాలనీ ఇళ్ల వద్ద గంజాయిని అక్రమంగా కలిగి ఉన్నారనే సమాచారం మేరకు ఏడుగురు యువకులను అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోకున్నామని సిఐ పివిజి.తిలక్ తెలిపారు. పట్టణ ఎస్ఐ కె.జగన్ మోహనరావు, సిబ్బంది వారిని పట్టుకున్నారని తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేకంగా నిషేధిత మత్తు పదార్థాలను కలిగి ఉన్నా, రవాణా చేసిన, అమ్మిన, సేవించిన వారిపై కేసులు నమోదు చేయబడతాయి అని సీఐ హెచ్చరించారు.

సారా బటీపై దాడి

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం పెద్దగూడెం శివారులో మెట్టపై నాటు సారా తయారీ కేంద్రంపై దాడి చేసినట్లు ఎస్ఐ పి.మనోహర్ సోమవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు స్థానిక గోపాలపురం పెద్దగూడెం శివారు మెట్టపై నాటుసారా తయారీ కేంద్రంపై దాడి చేశామన్నారు. 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. 8 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన సుమారు 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు.



శేషారావు తో జిన్నా బాబు, తదితరులు

బూరుగుపల్లిని కలిసిన ఎంసి చైర్మన్ జిన్నాబాబు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన గాలింకి జిన్నాబాబు సోమవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావును వేలివెన్ను ఆయన స్వగహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిన్నాబాబుకు శేషారావు అభినందనలు తెలిపారు. బాధ్యతాయుతంగా పదవిని నిర్వహించాలని, అలాగే పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలని సూచించారు. పార్టీకి నిబద్ధతతో పని చేసే వారికి పదవులు వాటంతటవే వస్తాయన్నారు. టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, చివటం టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు. జిన్నాబాబు సన్నిహితులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు గత నాలుగు రోజులుగా పూల బొకేలతో శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఆర్ఎస్‌కె వద్ద సిమెంట్ బెంచీల ఏర్పాటు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ప్రోత్సాహంతో పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉండ్రాజవరం రైతు సేవా కేంద్రం వద్ద రైతులు విశ్రాంతి తీసుకునేందుకు మూడు సిమెంట్ బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించారు.

'మానవత' ఆర్థిక సాయం

ప్రజాశక్తి- తాళ్లపూడి

భర్తను కోల్పోయి కుటుంబ ఖర్చులు, కుమార్తె చదువు కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మండలంలోని సూరయ్య పేట గ్రామానికి చెందిన కడిమి సౌదామిని అనే మహిళకు మండల మానవతా శాఖ సోమవారం రూ.6వేల ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ కార్యక్రమంలో మండల మానవతా శాఖ అధ్యక్షులు వి.శ్రీనివాస్, సభ్యులు ఎస్.రాజశేఖర్, పి.దుర్గాప్రసాద్, టిఆర్.మోహన్‌రావు, ఎస్.సుబ్బారావు, బి.శంకర్, ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహం చర్చకు రావాలి : ఎంఎల్ఎ నెహ్రూ

ప్రజాశక్తి - జగ్గంపేట

రాజకీయ జీవితం ప్రారంభించే నాటికి ఎవరి స్థితిగతులు ఏంటో తేల్చుకునేందుకు మీడియా వద్ద చర్చకు రావాలని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ వైసిపి నేత తోట నరసింహంకు సవాల్ విసిరారు. గోకవరంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నరసింహం ఆదివారం చేసిన వ్యాఖ్యలపై ఎంఎల్ఎ నెహ్రూ స్పందించారు. మీడియా సమావేశంలో రంకెలు వేయడం కాదని, అన్నేళ్ల పదవీ కాలంలో డిగ్రీ కళాశాలను తప్ప నియోజకవర్గానికి ఏమి చేశావని తోటను ప్రశ్నించారు. నన్ను నెగ్గించిన ప్రజలకు న్యాయం చేయాలని ఉద్దేశంతో నేను పార్టీ మారానని, మారినట్టుగానే న్యాయం చేశానన్నారు. రింగ్ రోడ్డు పునర్వ్యవస్థీకరణ కోసం రూ.30 కోట్లు, సామర్లకోట, గోకవరం రోడ్డుకు రూ.25 కోట్లు సిఎం చంద్రబాబుతో మంజూరు చేయించుకున్నట్టు తెలిపారు. మంత్రిగా పని చేసి ఆ శాఖ కార్యాలయాన్ని జగ్గంపేటలో ఎందుకు నిర్మించలేదో సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వంలో రెండేళ్లు ఇన్‌ఛార్జిగా ఉన్నప్పుడు తాళ్ళూరు లిఫ్ట్ రిపేరుకు ఎందుకు నిధులు తేలేదని ప్రశ్నించారు. ఆ నిధులు తెచ్చేందుకు తాను అహర్నిశలు ప్రయత్నం చేస్తున్నానన్నారు. త్వరలో టెండర్లు కూడా పిలవబోతున్నారని తెలిపారు.



అభివృద్ధి ప్రణాళికల పుస్తకాన్ని చూపిస్తున్న ఎంఎల్ఏ జ్యోతుల నెహ్రూ

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి స్టార్ట్ అయ్యిందన్నారు. ఆర్భాటం కోసం తాను కార్యక్రమాలు చేయనని, అవసరం కోసం మాత్రమే చేస్తానన్నారు. ఈ సమావేశంలో కొత్త వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, బుర్రి సత్తిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, బద్ది సురేష్ పాల్గొన్నారు.

కేటాయించిన ప్రదేశాల్లో వ్యాపారాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులు తమకు కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చిరు వ్యాపారులు, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో చిరు వ్యాపారులు తమ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు గ్రీన్ జోన్, ఎంబర్ జోన్, రెడ్ జోన్‌లుగా ప్రదేశాలను గుర్తించామన్నారు. ట్రాఫిక్, ప్రజలకు, వ్యాపారులకు ఇటువంటి ఇబ్బందులూ లేకుండా జోన్‌ల ఎంపిక చేశామన్నారు. ఎవరికి ఏ ప్రదేశంలో స్థలం కేటాయించారో ఆ స్థలంలోనే వ్యాపారాలు చేసుకోవాలన్నారు. దీనిపై చిరు వ్యాపారుల సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆయన వ్యాపారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మూడు రోజుల్లోగా మరో జోన్ గుర్తించి ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఫణికుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ, పెద్దాపురం సిఐ జయశంకర్, మున్సిపల్ కౌన్సిలర్ యర్రా శ్రీను, మెప్మా సిఎంఎం భ్రమరాంబ, యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సాయినాథ్, సిఒలు శ్రీదేవి, నర్గీస్, టిఎల్‌ఫఒ బి.పూల భవాని, టిఎల్‌ఎఫ్ ఆర్‌పి సత్య వాణి పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తూ కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని టిడిపి నియోకకవర్గ కో ఆర్డినేటర్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు అన్నారు. వలసపాకలలోని తమ నివాసం వద్ద నియోజకవర్గానికి సంబంధించి పలు గ్రామాల లబ్ధిదారులకు 11 మందికి రూ.5.96 లక్షల చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంత లక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల బాగోగులకే ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ దిశా నిర్దేశంలో ఆరోగ్యరంగాన్ని నూతన దిశగా నడిపిస్తూ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్స పొందిన బాధితులకు సహాయంగా సిఎంఆర్‌ఎఫ్ ద్వారా నేరుగా ఆర్థిక సాయం అందించడం, పేద ప్రజలకు ఊరటనిస్తోందని వారు పేర్కొన్నారు. ఇది గత ప్రభుత్వంలో కనబడని పారదర్శకతకు దూర దృష్టికి నిదర్శనమన్నారు. లబ్ధిదారుల వివరాలు, చికిత్స రికార్డులు పరిశీలించిన తర్వాత, ప్రభుత్వం ఎల్ఒసి విధానం ద్వారా నేరుగా ఆసుపత్రికి చెల్లింపు చేసి, పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా చేస్తోందని వివరించారు.

ఉపాధ్యాయునికి జాతీయస్థాయి అవార్డు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మండలంలోని పాలగుమ్మి జడ్‌పి ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు నరసింహ చంద్రకుమార్ 'గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు'ను అందుకున్నారని క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ అధినేత అంజి ఆకొండి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల తమ సంస్థ ఆధ్వర్యంలో సింధూర్ - సెల్యూట్ ఇండియన్ సోల్జర్స్' అనే అంశంపై జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రకళా పోటీలలో 15 రాష్ట్రాలకు చెందిన 250 మంది చిత్రకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీల్లో పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్, కల్నల్ సోఫియా ఖురేషి చిత్రాన్ని వాటర్ కలర్స్ ఉపయోగించి వేశారని తెలిపారు. జాతీయ స్థాయి చిత్రకళా పోటీలలో అవార్డు వచ్చినందుకు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్‌ను పలువురు అభినందించారు.

మిథున్ రెడ్డి అరెస్టుపై వైసిపి శ్రేణుల నిరసన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్, రామచంద్రపురం

ఎంపి మిథున్ రెడ్డి అరెస్టును ఖండిస్తూ సోమవారం రూరల్ మండలం జనుపల్లి గ్రామంలో వైసిపి విద్యార్థి విభాగం ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ రమేష్ జిల్లెళ్ళ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్ళపై నిరసన వ్యక్తం చేశారు. ఎటువంటి ఆధారాలు లేని కేసులో మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం దారుణమని రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు పెయ్యాల సాయి, బడుగు మోహన్, వరసల సుజిత్, విన్సీ, సాగర్, ఆనంద్, రవికుమార్, సల్మాన్ రాజ్ పాల్గొన్నారు. ఎంపి మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులో ఇరికించి అరెస్టు చేయడాన్ని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎక్సైజ్ శాఖకు సంబంధం లేని వ్యక్తిపై తప్పుడు ఆరోపణలు, బలవంతపు ఒప్పందాలు, అధికార దుర్వినియోగం ద్వారా కేసులు పెట్టడం దారుణమన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని హుస్సేన్‌పురానికి చెందిన వై.దుర్గ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అచ్చంపేట లోని టిడిపి కార్యాలయం లో సోమవారం పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప అందజేశారు.అనారోగ్యంతో బాధపడుతూ వైద్యానికి ఆర్థిక స్తోమత లేక సాయం కోసం అర్థించగా ఎమ్మెల్యే చినరాజప్ప సిఫార్సుతో సీఎం సహాయనిధి రూ. 40,028 మంజూరైంది.ఈ చెక్కును సోమవారం ఎమ్మెల్యే అందజేశారు.ఈ కార్యక్రమంలో హుస్సేన్ పురం గ్రామ టీడీపీ అధ్యక్షులు చల్లా బుజ్జి, రైతు సంఘం అధ్యక్షుడు కంటే జగదీష్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మెంటారావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి పెద్దాపురం వచ్చిన ఎవిడి మెంటారావును సీతారామ పట్టణ రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం సంఘ అధ్యక్షుడు దేవరకొండ సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మెంటారావు మాట్లాడుతూ రజకుల సమస్యలపై తనకు అవగాహన ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రజకుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని ప్రకటించారు. అనంతరం ఆయన టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజును ఆయన స్వగృహంలో కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం సీతారాముడు చెరువు వద్ద ఉన్న ధోబీఘాట్, రజకుల చెరువు, రజకుల కల్యాణ మండపం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రజక చైతన్య సేవా సంఘం అధ్యక్షులు కాకినాడ రామారావు, గొల్తి సత్యనారాయణ, గరగపాటి పెంటయ్య, సుధాకర్, లోవరాజు, ప్రసాద్, ర్యాలి పెంటయ్య, కొత్తపల్లి సుబ్బారావు, అక్కవరపు శ్రీను, ముంగళ్ళ రాంబాబు, పల్లంకుర్తి నాగమణి, శ్రీను, దేవరకొండ శ్రీను, వెంపటి అబ్బు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ప్లానింగ్ విభాగంపై హర్షం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

గ్రామ పంచాయతీలు సుసంపన్నం కావాలనే సుదూర లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీలలో ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేయడం హర్షణీయమని మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాలుగువేల మంది జనాభా లేదా రూ.50 లక్షలకు పైబడి వార్షికాదాయం కలిగిన పంచాయతీలలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేందుకు ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన హర్షణీయమన్నారు. మేజర్ గ్రామ పంచాయతీలలో ప్లానింగ్ విభాగం లేకపోవడం వల్ల అస్తవ్యస్తంగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. భవన నిర్మాణ అనుమతులన్నీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు మంజూరు చేయడం వల్ల పంచాయతీలన్నీ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడంతో పాటు చాలా కాలయాపన జరుగుతోందన్నారు. వాస్తవంగా 73, 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం 29 అంశాలను పంచాయతీరాజ్ వ్యవస్థకు బదిలీ చేయాల్సి ఉందన్నారు. అందులో భాగమే మేజర్ పంచాయతీలలో ప్లానింగ్ విభాగం ఏర్పాటు అన్నారు. మేజర్ గ్రామపంచాయతీలలో భవన నిర్మాణ అనుమతులను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి తొలగించి పంచాయతీలలో ప్లానింగ్ విభాగం ద్వారా మంజూరు వల్ల అవి ఆర్థికంగా బలోపేతం అవడంతో పాటు మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం నిజమవుతుందని అడబాల తెలిపారు.

పోలీసుల వాహన తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

హెల్మెట్, రేష్ డ్రైవింగ్‌పై సిఐ కృష్ణభగవాన్ సోమవారం విస్తత తనిఖీలు చేపట్టారు. వాహనదారులకు పోలీస్ యాప్ ద్వారా అపరాధ రుసుములు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్లు లేని డ్రైవింగ్, లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం, అతివేగంగా వాహనాలు నడిపే వారిపై చర్యలకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సెంటర్‌లో బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థినులను ఏమైనా సమస్యలు వున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన

ప్రజాశక్తి - పెద్దాపురం

కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పరిపాలనపై ప్రజల్లో విస్తత ప్రచారం నిర్వహించాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం కాండ్రకోటలోని పద్మశ్రీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాల ద్వారా సహాయ సహకారాలు అందించామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను కూడా అమలు చేయలేదన్నారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, గ్రామ సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఎంపిటిసి వీరభద్రరావు, గవరసాన రాజశేఖర్, ఇనుకొండ వీర విష్ణు చక్రం పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -కరప

వేళంగి మాజీ సర్పంచ్ డాక్టర్ బూసం సుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివని గ్రాడ్యుయేట్ యూత్ నాయకులు అన్నారు. సోమవారం ఆయన జయంతి సందర్భంగా గ్రాడ్యుయేట్స్ యూత్ ఆధ్వర్యంలో వేళంగి పిహెచ్‌సి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లరింపచారు. సానా శ్రీను, మేడిశెట్టి పట్టాభి, వాసంశెట్టి సుబ్బారావు, పురం ప్రసాద్, ముడుగు కృష్ణ, చాపల శివ, రాంబాబు, నరేష్, దూళ్ల వీరేంద్ర పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలలో భాగంగా మరిడమ్మ కాలక్షేప మండపంలో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు యాత్రికులు, ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. భావయామి ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ ఆర్ట్స్ గురువు పవన్ కుమార్ చక్రవర్తుల సారథ్యంలో సుమారు 50 మంది విద్యార్థినులు పలు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. ఈ నృత్యాలు తిలకించిన అందరూ బాలికలను అభినందించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, ఆలయ అనువంశిక ధర్మకర్త చింతపల్లి శ్రీహర్ష ఆధ్వర్యంలో నాట్యాచార్యులు పవన్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్ అవినీతి

ప్రజాశక్తి-పిఠాపురం

జగన్ తన అధికారాన్ని అడ్డంపెట్టుకుని అవినీతికి పాల్పడ్డారని మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ ఆరోపించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో వర్మ మాట్లాడారు. లిక్కర్ స్కామ్‌లో జగన్ అధికారాన్ని అడ్డం పెట్టుకొని రూ.32,000 కోట్లు కుంభకోణానికి తెరలేపారన్నారు. నెలకి రూ.60 కోట్లు సిఎం హోదాలో ఉండి మద్యం కమీషన్ ద్వారా సంపాదించారంటే ఏ స్థాయిలో సిఎం కుర్చీని అపవిత్రం చేశారో అర్థం చేసుకోవచ్చాన్నారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్ చేసిన కుంభకోణాలు గురించి ప్రపంచం అంతా తెలుసన్నారు. దీంతో జగన్ జైలుకు వెళ్లారని బెయిల్‌పై బయటకు వచ్చి సిఎం హోదాను అడ్డం పెట్టుకొని మళ్లీ అవినీతికి పాల్పడ్డారన్నారు. చట్టాలన్నా, జైలు అన్నా భయం లేకుండా జగన్ అలవోకగా అవినీతికి పాల్పడ్డారన్నారు. ఈ సమావేశంలో పలువురు టిడిపి నాయకులు పాల్గున్నారు.

ఘనంగా కర్తవ్య బాధ్యతల అప్పగింతల వేడుక

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు కర్తవ్య బాధ్యతల అప్పగింతల వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఎంపికైన విద్యార్థులతో చోళ, కాకతీయ, మరాఠా, మౌర్య విభాగాలుగా విద్యార్థులు నిర్వహించిన కవాతు ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వైడి.రామారావు ఎన్‌సిసి విద్యార్థులకు, చోళ, కాకతీయ, మరాఠా, మౌర్య విభాగాల కెప్టెన్లు, వైస్ కెప్టెన్లకు కర్తవ్య నిర్వహణ గుర్తులను పంపిణీ చేశారు. అనంతరం రామారావు మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు తమ తోటి విద్యార్థులను కూడా బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల డైరెక్టర్ సిహెచ్.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధైర్యం, క్షమ గుణాలు అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్.మూర్తి, ఎంఆర్.కళాశాల మాజీ ప్రిన్సిపల్ ఆర్.ప్రభాకర రావు, పాఠశాల అకాడమిక్, మీడియా కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకే కేటాయించాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మండలంలో చిన్నశంకర్లపూడిలో కేంద్ర ప్రభుత్వ గోశాల పథకాన్ని అధికార పార్టీ నేతలకు ఇచ్చి అర్హులైన రైతులకు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని గ్రామానికి చెందిన రైతు ఏపూరి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో తనకు 20 ఆవులు ఉన్నప్పటికీ గోశాల షెడ్డు మంజూరు చేయమని అధికారులకు పంచాయితీ తీర్మానం చేసి ఇచ్చినప్పటికీ లబ్ధిదారుడిగా తనకు షెడ్డు మంజూరు చేయకుండా కార్యకర్తలకు మంజూరు చేశారని వాపోయారు.

శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని వినతి

ప్రజాశక్తి-రౌతులపూడి

మండల కేంద్రమైన రౌతులపూడి దళిత శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని దళితులు కోరుతున్నారు. దళిత కుటుంబానికి చెందిన వ్యక్తి సోమవారం మృతి చెందారు. ఉదయం అల్ప పీడన ప్రభావంతో కురిసిన వర్షంతో మృతదేహాన్ని తీసుకువెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో తీవ్ర అవస్థలు పడ్డామని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మశాన వాటిక అభివృద్ధి చేయాలని వారంతా కోరుతున్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని కొత్తూరు మండల పరిషత్ పాఠశాలకు పారిశ్రామికవేత్త చింత నాగ సత్యనారాయణ మూర్తి కంప్యూటర్, ప్రింటర్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, పాఠశాల అవసరాలకు వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఇఒ బి.అప్పాజీ ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు కంప్యూటర్ విద్య ఆవశ్యకతను వివరించారు. దాతను, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ కె.నాగరాజేశ్వరి, హెచ్ఎం వైవివి.రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సినీ నటుడు గౌతమ్ రాజు సందడి

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

సినీ నటుడు గౌతమరాజు యు కొత్తపల్లి మండలంలో సోమవారం సందడి చేశారు. కొన్ని షార్ట్ ఫిలిం సన్నివేశాలు చిత్రీకరణ లొకేషన్ పరిశీలించేందుకు వచ్చినట్టు గౌతమ్ రాజుకు సన్నిహితుడైన వాకతిప్పకు చెందిన పేరూరి కల్కి తెలిపారు. గౌతమ్ రాజు రావడంతో పలువురు సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు ఆసక్తి చూపారు



పతకాలు సాధించిన పెద్దాపురం విద్యార్థులు

కరాటే పోటీల్లో పతకాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

విశాఖపట్నంలో 11వ రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో పెద్దాపురం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు, వెండి పతకాలు సాధించారు. సీనియర్స్ విభాగంలో తెప్పల యోగేష్ కరాటేలోని కాటాలో బంగారు పతకం , కుమిటీలో బంగారు పతకం సాధించాడు. బాలికల విభాగంలో యాసలపు సూర్య కళ కాటాలో బంగారు పతకం, కుమిటీలో బంగారు పతకం సాధించింది. జూనియర్స్ విభాగంలో పాసిల లోకేష్ కుమిటీలో బంగారు పతకం, కాటాలో రజత పతకం సాధించాడు. పతకాలు సాధించిన విద్యార్థులను పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ కుమార్ అభినందించారు.

జంక్ ఫుడ్‌తో రోగాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పోషక విలువలు లేని అధిక కేలరీలు గల అనారోగ్యకరమైన జంక్ ఫుడ్‌ను అధికంగా తీసుకుంటే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జంక్ ఫుడ్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జంక్ ఫుడ్‌లో కొవ్వు అధికంగా ఉండటంతో పాటు చక్కెర మోతాదు కూడా ఎక్కువగా ఉంటుందన్నారు. వీటిలో ఖనిజాలు, విటమిన్లు, ప్రోటీన్లు, ఫైబర్ తక్కువగా ఉంటాయన్నారు. మిఠాయిలు, శీతల పానీయాలు, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలలో జంక్ ఫుడ్ ఉంటోందన్నారు. వీటిని అధికంగా తీసుకుంటే ఊబకాయం, మధుమేహం, జీర్ణ సమస్యలు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలు వేధించే అవకాశం ఉన్నందున వీటిని తీసుకోరాదని డాక్టర్ అడ్డాల తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, కుమార్ యాదవ్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో హైటెక్ వ్యభిచారం

నిర్వాహకులకు పోలీసులు అండదండలు.?

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా పెద్దాపురంలో హైటెక్ వ్యభిచారం జరుగుతుందనే విమర్శలు ఇటీవల బాగా ఎక్కువగా వినిపిస్తున్నాయి. స్థానిక పోలీసులు, వ్యభిచార ముఠా నాయకులు కలిసి ఈ దందా కొనసాగిస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. పెద్దాపురంలో దర్గా సెంటర్ కేంద్రంగా ఈ వ్యవహారం పెద్ద ఎత్తున నడుస్తుంది. పోలీసుల అండదండలతో వ్యభిచార గృహాల నిర్వాహకులు కలిసి కొన్నేళ్లుగా ఈ దందాను నడుపుతున్నారు. ఒక బాధితురాలి ఉదంతంతో ఈ హైటెక్ వ్యభిచారం వ్యవహారం బయటకు పొక్కింది.

ఉపాధి పేర వ్యభిచారం

ఉద్యోగాలు ఇప్పిస్తానని, ఉపాధి కల్పిస్తామని నమ్మబలుకుతూ కొందరు కీచకులు అమాయక మహిళలను టార్గెట్‌గా చేసుకుని వ్యభిచార కూపంలోకి లాగుతున్నారు. తన బిడ్డను దాచేసి బలవంతపు వ్యభిచారం చేయిస్తున్నారని సామర్లకోటకు చెందిన బాధిత మహిళ జిల్లా ఎస్పీ, డిజిపి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు చేయడంతో హైటెక్ వ్యభిచారం మరోసారి వెలుగులోకి వచ్చింది. స్థానిక పోలీసులు బిడ్డను అప్పగించినప్పటికీ తనకు న్యాయం జరగలేదని ఆ మహిళ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. తనను బెదిరింపులకు గురి చేస్తున్న భారతి అనే మహిళపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆమె చెబుతున్నారు. భయపెట్టి, బెదిరించి, చిత్రహింసలు పెట్టి నాలుగేళ్లు బలవంతంగా వ్యభిచారం చేయించినందుకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీలు పెట్టుకున్నా స్పందించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

పెట్రోలు బంకులో పని చేస్తున్న తనకు పెద్దాపురం దర్గా సెంటర్ ప్రాంతానికి చెందిన గొల్లవిల్లి భారతి పరిచయమైందని, తన ఇంట్లో పనిమనిషిగా చేస్తే నెలకు రూ.15 వేలు జీతం ఇస్తానని చెప్పి పనిలో పెట్టుకుందని బాధితురాలు తెలిపింది. నెల తర్వాత వ్యభిచారం చేయమని బలవంతం చేసిందన్నారు. ఒప్పుకోకపోవడంతో కొంతమంది వ్యక్తులతో చిత్రహింసలకు గురి చేసి బలవంతంగా వ్యభిచారం చేయించిందని తెలిపింది. వ్యభిచారంలోకి దిగిన 5వ నెలలోనే తాను గర్భవతిని అయ్యాయని, 8వ నెల వచ్చినా సరే వ్యభిచారం చేయిస్తునే ఉందని ఆవేదన వెలిబుచ్చింది. ఆడ బిడ్డ పుట్టిన తరువాత భారతి తన బిడ్డను తీసుకెళ్లిపోయిందని తెలిపింది. ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకుని వ్యభిచారం చేయకపోతే తన బిడ్డను చంపేస్తానని చెప్పి బయపెట్టేదని వాపోయింది. ఒక రోజు భారతికి జ్వరం రాగా ఆమెను హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లిన సమయంలో తాను పోరిపోయి ఎస్‌పికి ఫిర్యాదు చేశానిని తెలిపింది. దీంతో తన కుమార్తెను రక్షించి అప్పగించారని, కానీ ఖాళీ చెక్కులు ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకాలు, ఇవ్వలేదన్నారు. వాటిని అడ్డుపెట్టుకుని తనను బెదిరిస్తున్నట్లు తెలిపింది. వారి నుంచి తనకు హాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటోంది. తనలాంటి వారు చాలా మంది ఈ కూపంలో ఇరుక్కుపోయారని తెలిపింది.వ్యభిచార గహం నిర్వాహకులు భారతికి కొందరు పోలీసులు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నారని తెలిపింది. దీనికి సంబంధించిన భారతితో కానిస్టేబుల్ దిగిన ఫొటోలను ఆమె చూపిస్తోంది.

విచారణ చేస్తున్నాం

పెద్దాపురంలో వ్యభిచారం ఘటనపై విచారణ చేస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి అనిత సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. హైటెక్ వ్యభిచారం అంశంపై ఇప్పటికే జిల్లా ఎస్పి బిందు మాధవ్ తో మాట్లాడి వివరాలను తెలుసుకున్నానని, దీనిపై పూర్తిస్థాయి నివేదికను కోరామని ఆమె తెలిపారు. దీని వెనుక ఎవరున్నా వదిలే ప్రసక్తే లేదని, అసాంఘిక కార్యకలాపాలు, మహిళలను వేధించే ఘటనలను కూటమి ప్రభుత్వం సహించే ప్రసక్తే లేదన్నారు.